క్లుప్తంగా

అనాథలకు చేయూత



బియ్యం అందజేస్తున్న రాంరెడ్డి

బడంగ్‌పేట్: అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమంలోని అభాగ్యులకు అన్నదానం చేశారు. శుక్రవారం తన తల్లి వర్ధంతి సందర్భంగా అనాథలకు మూడు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామిడి ప్రతాప్‌రెడ్డి, కార్పొరేటర్ రామిడి కవిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు పరుగు



షాహిన్‌నగర్ రోడ్డుపై మురుగు నీరు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీశైలం ప్రధాన రహదారిపై నిత్యం ఏదో ఒక చోట మురుగునీరు పారుతూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. షాహిన్‌నగర్‌లోని జేజీఆర్ గార్డెన్ ఎదురుగా రోడ్డుకు సగానికి పైగా మురుగునీరు పరుచుకొని ప్రవహిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎర్రకుంట చౌరస్తా సమీపంలో మురుగునీరు పారుతూ రోడ్డు దెబ్బతింటోంది. అధికారులు స్పందించి వెంటనే మురుగు రోడ్డు పక్క నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే రోడ్డు దెబ్బదింటుందని వాహనదారులు పేర్కొన్నారు.

సాగు భూములకు రైతు భరోసా

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: సాగు యోగ్యమైన భూములకు రైతు భరోసా అందుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో రైతుల పేరుతో అసైన్డ్, వెంచర్లు, జాతీయ రహదారుల భూములకు కొందరు రైతుబంధు పొందారని ఆరోపించారు. చెరువుల కింద భూములు తీసుకున్న రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అర్హులందరికీ న్యాయం జరిగేలా జాబితా సిద్ధం చేస్తుందని పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: వార్డులో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ అన్నారు. శుక్రవారం పుర పరిధిలోని 10వ వార్డులో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఐదేళ్ల నుంచి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఈర్లగండి మైసమ్మ బోనాలు



రంగులు వేయిస్తున్న నిర్వాహకులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని ఈర్లగండి మైసమ్మ ఆలయం బోనాల ఉత్సవాలకు ముస్తాబవుతోంది. సంక్రాంతి పండుగ అనంతరం ఆలయంలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 26న బోనాల పండుగ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నామని, భక్తుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని ఆలయ కమిటీ పేర్కొంది.

మూణ్నాళ్ల ముచ్చటే



శివాహిల్స్ కాలనీ రోడ్డు దుస్థితి

అభివృద్ధి పేరిట రహదారుల ధ్వంసం

- పైప్‌లైన్ల కోసం బీటీరోడ్ల తొలగింపు
- అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రజాధనం వృథా

మీర్‌పేట: అభివృద్ధి చేసిన రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. ఏళ్ల అనంతరం కొత్తగా నిర్మించిన సీసీ,బీటీ రహదారిని అనతికాలంలోనే.. పైప్‌లైన్ల పేరిట తవ్వేశారు. అవే పైపులైన్లు రోడ్డు వేయకముందే తీసుంటే ప్రజాధనం వృథా అయ్యేది కాదని, ప్రజలకు ఇబ్బందులు తప్పేవని స్థానికులు పేర్కొంటున్నారు.

డ్రైనేజీ లైన్ కోసం..

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నందిహిల్స్– బీఎన్‌రెడ్డినగర్ మార్గంలో ఏడాదిన్నర క్రితం కొత్తగా సీసీరోడ్డు వేశారు. అంతకు ముందు కొన్నేళ్లు ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్డు చేసిన కొన్నాళ్లకే డ్రైనేజీ లైన్ కోసం పూర్తిగా తవ్వేశారు. దీంతో పరిస్థితి మొదటికి వచ్చింది. పనులు పూర్తయ్యేదెప్పుడు, రోడ్డును పునర్నిర్మాణం చేసేదెప్పుడని ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఏదైనా రోడ్డు వేయకముందే డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో అభివృద్ధి చేసిన రోడ్డును తవ్వడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శివాహిల్స్ రోడ్డు..

ప్రధాన రహదారితో పాటు శివాహిల్స్ కాలనీ బీటీ రోడ్డును తవ్వేశారు. కాలనీ ఏర్పడిన చాలా సంవత్సరాలకు రోడ్డు వేశారని, వేసిన కొంత కాలానికే డ్రైనేజి లైన్ పేరిట ధ్వంసం చేశారని స్థానికులు తెలిపారు. మళ్లీ రోడ్డు వేయాలంటే కొత్తగా ప్రతిపాదనలు పెట్టాలి, నిధులు మంజూరు ఇప్పట్లో సాధ్యమయ్యేలా లేదని అభిప్రాయపడుతున్నారు. ఇలా



నందిహిల్స్ ప్రధాన రహదారి

చేయడం వలన ప్రజాధనం వృథా అవుతుందని, పనులు పూర్తయ్యాక వీలైనంత త్వరగా రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, సాధారణ స్థితికి తీసుకువచ్చేలా అధికారులు చొరవ తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

కందుకూరు: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని గూడూరు గేట్ వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. కాగా సీడీపీఓ శాంతిశ్రీ బాలికలతో కేక్ కట్ చేయించి, జీఎంఆర్ సంస్థ అందించిన శానిటరీ న్యాప్‌కిన్స్‌ను బాలికలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీడీపీఓ బాలికల హక్కులు, సమానత్వం, విద్య ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించారు. డీవీ కౌన్సిలర్ అనిత పోక్సో చట్టం గురించి, బాల్య వివాహాలతో ఏలాంటి దుష్ప్రభావాలు ఉంటాయో వివరించారు. మహిళా సాధికార కేంద్రం



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ

ఫైనాన్షియల్ లిటరసీ స్పెషలిస్టు ఎస్.శ్రీకాంత్ సైబర్ భద్రత, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సబిత, శ్రీలత, విద్యార్థినీలు పాల్గొన్నారు.



గూడూరు గేట్ వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకులంలో విద్యార్థినులతో కేక్ కట్ చేయిస్తున్న సీడీపీఓ తదితరులు

అతివేగం అనర్థం

- మద్యం మత్తులో డ్రైవింగ్ వద్దు
- నిబంధనలతో ప్రమాదాల నివారణ: సీఐ

మహేశ్వరం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. అతివేగం అనర్థమని, మద్యం తాగి వాహనం నడపవద్దని హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో మహేశ్వరం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలను పాటిస్తే రహదారి ప్రమాదాలను నివారించగలమన్నారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ లక్ష్మీసుధ, అసిస్టెంట్, మేనేజర్ అంజమ్మ, డిప్యూటీ సుపరింటెండెంట్, మెకానిక్ రఘు, ఆఫీస్ సుపరింటెండెంట్ శేఖర్, ఎంప్లాయీ బోర్డు సభ్యులు నర్సింహ ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది, విద్యార్థులు

రేపు విద్యుత్ సమస్యలపై సదస్సు

మహేశ్వరం: కందుకూరు డివిజన్ 33 కేవీ ఉప కేంద్రం విద్యుత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల సదస్సు(ప్రత్యేక కోర్టు) నిర్వహిస్తున్నామని ఆ శాఖ డీఈ గోపాల కృష్ణ, ఏఈ చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు. కందుకూరు, మహేశ్వరం, బాలాపూర్, పహాడీషరీఫ్, ఆమన్‌గల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు సరఫరాలో వచ్చే అంతరాయాలు, హెచ్చు తగ్గులు, విద్యుత్ మీటర్,కొత్త సర్వీస్ ఇచ్చుట, పేరు బదిలీ తదితర సమస్యలు చర్చించి విద్యుత్ చట్టానికి లోబడి పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ సదస్సును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హనుమాన్‌నగర్, పెద్ద అంబర్‌పేట, గణేష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు. 11కేవీ శివంహిల్స్, మదర్ డెయిరీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మీర్‌పేట పరిధిలో..

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లలితానగర్ ఫీడర్ పరిధిలోని గాయత్రినగర్, గాయత్రిహోమ్స్, సీతాహోమ్స్, జిల్లెలగూడ విలేజ్, వెంకటేశ్వర కాలనీ, మిథులానగర్, సత్య సాయి ఎన్‌క్లేవ్, కమలా నెహ్రూనగర్, డీఎస్‌ఆర్‌నగర్. 11కేవీ జనార్దన్‌రెడ్డి ఫీడర్ పరిధిలోని భూపేష్‌గుప్తానగర్, శ్రీధర్‌కాలనీ, వివేక్‌నగర్, వెంకటేశ్వరకాలనీ, హనుమాన్‌నగర్‌లలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేశాం

తుక్కుగూడ చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: మున్సిపాలిటీ ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తమ అదృష్టమని చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. శుక్రవారం పుర కేంద్రంలోని ఎస్ఎన్ గార్డెన్‌లో కౌన్సిలర్లు తమ పదవీ కాలం ఐదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాలక మండలి సభ్యులందరూ గత ఐదేళ్ల నుంచి వార్డుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశామన్నారు. కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసి మున్సిపల్‌ను అభివృద్ధి చేశామన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులు పాలకమండలి సభ్యులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, వైస్‌చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు శివకుమార్, పద్మ, తేజస్విని, విలాస్, రవినాయక్, సుమన్, భావన, రాజు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో పాలకమండలి సభ్యులకు సన్మానం చేస్తున్న అధికారులు

ఊరెళ్లను మున్సిపాలిటీలో కలపొద్దు

- ఆందోళన చేపట్టిన గ్రామస్తులు
- ఆర్డీఓ, తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత

చేవెళ్ల: తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని మండలంలోని ఊరెళ్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఆందోళనకు దిగడంతోపాటు ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్‌లలో వినతిపత్రాలను అందజేశారు. చేవెళ్ల మున్సిపాలిటీలో ఊరెళ్ల గ్రామాన్ని కలుపుతున్నట్లు ఇటీవల వచ్చిన సమాచారంతో గ్రామస్తులు నిరసనబాట పట్టారు. గ్రామస్తులంతా పార్టీలకతీతంగా ముందుకు వచ్చి మున్సిపాలిటీలో గ్రామాన్ని కలపొద్దని వేడుకుంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఉపాధి కూలీ పనులపైనే దాదాపు 300ల మందికిపైగా కూలీలు జీవనం సాగిస్తున్నారని, అలాంటిది మున్సిపాలిటీలో కలిపితే ఉపాధి పనులు కోల్పోతామన్నారు. వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవించే గ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపితే తీరని అన్యాయం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలో కలిపే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఊరెళ్ల గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు, ఎమ్మెల్యే తమ సమస్యపై స్పందించాలని కోరారు. అనంతరం ఆందోళనకు దిగిన గ్రామస్తులను పోలీసులు ఠాణాకు తరలించారు. సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్ఐ సంతోష్‌రెడ్డిలు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కార్యక్రమంలో ఊరెళ్ల గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్

అనర్హులకు 'అంత్యోదయ' తొలగించండి

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో అర్హులు కాని వారికి కూడా అంత్యోదయ కార్డులు ఉన్నాయని, వాటిని తొలగించాలని కోరుతూ ఆ గ్రామ మాజీ వార్డు సభ్యుడు ఇంద్రకంటి రవీందర్‌గౌడ్ శుక్రవారం తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందించారు. గ్రామంలో మొత్తం 58 అంత్యోదయ కార్డులు ఉన్నాయని, అందులో చాలామంది అర్హులు కాని వారు ఉన్నారని, దీంతో అసలైన అర్హులకు అన్యాయం జరుగుతుందని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రవీందర్‌గౌడ్ తదితరులు

ఆత్మగౌరవ ప్రతీక పాపన్నగౌడ్



పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

- ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం
ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి డబిల్‌గూడ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లతో కలిసి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగం, చట్టాలు లేని రోజుల్లోనే ప్రజల హక్కుల కోసం పాపన్న గౌడ్ పోరాడారని గుర్తుచేశారు. మొఘల్ సైన్యాన్ని సైతం ఎదురించి నిలబడిన మహనీయుడని కొనియాడారు. పేదల కోసం నిరంతరం తపించారని చెప్పారు. తెలంగాణలో జమీన్‌దారులు, జాగీర్దార్లు, పెత్తందార్లు భూస్వామ్య ధనిక వర్గాలపై తిరుగుబాటు బావుటాను ఎగురవేసిన తొలి విప్లవ వీరుడు పాపన్న గౌడ్ అని కీర్తించారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు రామారావు గౌడ్, గౌడ అఫీషియల్ ప్రొఫెషనల్ అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్, బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు పాపయ్య గౌడ్, పార్టీ జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్, సంఘం మండల అధ్యక్షుడు సుధీర్, బీజేపీ మండల అధ్యక్షుడు యాదిష్ పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- ఆగిన రిటేయినింగ్ వాల్ నిర్మాణ పనులు
- తీవ్ర అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణ పనులతో వాహనదారులు విసుగెత్తిపోతున్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జిపై నిర్మిస్తున్న రిటేయినింగ్ వాల్ పనుల్లో జాప్యం ఏర్పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిత్యం ట్రాఫిక్‌జాం, దుమ్ము, ధూళితో నరకప్రాయంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు.



బ్రిడ్జిపైన రిటేయినింగ్ వాల్ పనులు, చిత్రంలో హెచ్చరిక బోర్డులు



అసంపూర్తిగా ఉన్న రిటేయినింగ్ వాల్

శంకర్‌పల్లి: షాద్‌నగర్–కంది రహదారి 100 ఫీట్ల వెడల్పుతో శంకర్‌పల్లి మండలం, పట్టణం గుండా వెళ్తుంది. ఈ రహదారి సుమారు 86 కిలోమీటర్ల మేర ఉంది. అయితే శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద రిటేయినింగ్ వాల్, పక్కన సీసీ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు తొలుత చేపట్టలేదు. దీంతో రోడ్డు వేసిన మూడేళ్ల తర్వాత ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. వాహనదారుల ఇబ్బందులు గుర్తించినా అధికారులు పనులకు సంబంధించి అంచనా వేయగా.. ప్రభుత్వం ఆరు నెలల క్రితం రూ.11.02కోట్లు మంజూరు చేసింది. సదరు గుత్తేదారుకి పనులు అప్పగించినా ఆర్‌అండ్‌బీ అధికారులు మొదట బ్రిడ్జి కింద, పక్కన సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అనంతరం బ్రిడ్జి పైన రిటేయినింగ్ వాల్ పనులు ప్రారంభించారు.

ఎదురవుతున్న సవాళ్లు

బ్రిడ్జికి ఆనుకోని రిటేయినింగ్ వాల్ నిర్మించేందుకు గాను అర్‌అండ్‌బీ అధికారులకు, సదరు గుత్తేదారుకి సవాళ్లు ఎదురయ్యాయి. ఆ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు వెళ్లడం, దానికి తోడు వర్షం పడడం ఆటంకంగా మారింది. దీంతో నిత్యం భారీ ఎత్తున ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. అర్‌అండ్‌బీ అధికారులు ట్రాఫిక్ పోలీసుల సహాయంతో పనులను చేపట్టారు. రిటేయినింగ్ వాల్ నిర్మాణం చేపట్టిన కొద్దీ భూమి కుంగిపోవడం, వర్షం కారణంగా వాల్ కూలిపోవడం వంటివి చోటు చేసుకున్నాయి. రెండు నెలల క్రితమే సగం పనులు పూర్తి చేసిన అధికారులు మిగిలిన సగం పనులనే అలానే వదిలేశారు. అరకొర పనుల కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

నిత్యం ట్రాఫిక్ జామ్

షాద్‌నగర్–కంది రహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. ముఖ్యంగా సరుకు రవాణా చేసే లారీలు షాద్‌నగర్ వైపు నుంచి కంది, సంగారెడ్డి మీదుగా ముంబయి వెళ్తుంటాయి. అదే కాకుండా షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, నవాబుపేట, తదితర మండలాలకు చెందిన రైతులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు ఈ రహదారిపైనే ఎక్కువ ఆధార పడతారు. రిటేయినింగ్ వాల్ పనులు సగం వరకు పూర్తి కావడం.. మిగిలిన రోడ్డుపైన పనులు నడుస్తున్నాయని, సూచిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఒక వైపు నుంచి వాహనాలు వస్తే.. మరొక వైపు ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికైనా స్పందించి రిటేయినింగ్ వాల్ పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జిపై రిటేయినింగ్ వాల్ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవం. పనుల్లో కొంత రిస్క్ ఉన్నందున, డిజైన్‌లో మార్పులు చేశాం. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించడంతో పనులను పూర్తి చేయలేకపోతున్నాం. దీనిపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి, వారి సహకారంతో వారం రోజుల్లో పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ, ఏఈ